సాక్షి
వికారాబాద్
శనివారం । 29 । మార్చి । 2025




ఏడుంటరో తెలియదు!

వైద్యారోగ్య శాఖలో పనిచేస్తున్న కొంతమంది నిర్లక్ష్యంతో ప్రజలకు సరైన వైద్య సేవలు అందడం లేదు. 10లో▸



నిబంధన తొలగించాలి

ఆర్‌వైవీఎస్ దరఖాస్తు ప్రక్రియలో రేషన్‌కార్డు నిబంధన తొలగించాలని కేవీపీఎస్ ప్రధాన కార్యదర్శి మల్కయ్య కోరారు. 10లో▸



న్యూస్‌రీల్

నేడు ముఖ్యమంత్రి పర్యటన

కొడంగల్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన సొంత నియోజకవర్గం కొడగంల్‌లో పర్యటించనున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. శనివారం సాయంత్రం శ్రీవారి బ్రహ్మోత్సవాలకు హాజరై స్వామి వారిని దర్శించుకుంటారు. రంజాన్ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో పట్టణంలోని రాఘవేంద్ర ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో పాల్గొంటారు.

1వ తేదీ నుంచి సన్నబియ్యం పంపిణీ

అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్



రేషన్ డీలర్లతో సమావేశమైన అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్

అనంతగిరి: వచ్చే నెల నుంచి రేషన్ కార్డుదారులకు సన్నబియ్యం పంపిణీ చేస్తున్నట్లు జిల్లా అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్ తెలిపారు. శుక్రవారం ఆయన తన చాంబర్‌లో జిల్లాలోని రేషన్‌షాపు డీలర్ల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు, ఇతర జిల్లా అధికారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ 1వ తేదీ నుంచి సన్నబియ్యం పంపిణీ కార్యక్రమం ప్రారంభిస్తున్నట్లు వివరించారు. దొడ్డు బియ్యం పంపిణీ చేసినట్లయితే సంబంధిత డీలర్‌లపై కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వ చేపట్టిన సంక్షేమ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. ఇప్పటికే జిల్లాలో 588 రేషన్ షాపులకు సన్నబియ్యం పంపించినట్లు ఆయన తెలిపారు.

'పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్' కు గడువు పెంపు

అనంతగిరి: పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్ పథకానికి దరఖాస్తు గడువు పెంచినట్లు ఎస్సీ డెవలప్‌మెంట్ జిల్లా అధికారి మల్లేశం శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్హులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు బోధన రుసుము, ఉపకార వేతనాల కోసం దరఖాస్తు గడువును ప్రభుత్వం మే 31వరకు పొడిగించిందని చెప్పారు. అర్హులైన విద్యార్థులు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునేలా కళాశాల యాజమాన్యాలు చూడాలని సూచించారు.

స్వయం ఉపాధి పథకాలకు దరఖాస్తుల ఆహ్వానం

డీఎండబ్ల్యూఓ హనుమంత్‌రావు



వేలం దక్కించుకున్న వెంకటరాములను సన్మానిస్తున్న రాజేశ్ తదితరులు

అనంతగిరి: రాజీవ్ యువ వికాస్ పథకంలో స్వయం ఉపాధి పథకాలకు దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా మైనార్టీ వెల్ఫేర్ ఆఫీసర్(డీఎండబ్ల్యూఓ) హనుమంత్‌రావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ముస్లింలు, క్రైస్తవులు, సిక్కులు, బౌద్ధులు, జైనులు, పార్శిల నుంచి అర్హులైన అభ్యర్థులు ఓబీఎంఎంఎస్ పోర్టల్ ఏప్రిల్ 5వ తేదీలోగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు.

తైబజార్@రూ.92 వేలు

దోమ: మండల పరిధిలోని దిర్సంపల్లి గ్రామంలో శుక్రవారం ఇన్‌చార్జి ఎంపీఓ పి.రాజేశ్ తైబజార్ వేలం నిర్వహించారు. ప్రత్యేక అధికారి నరేందర్ పాల్గొన్న ఈ వేలానికి గ్రామస్తులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. బహిరంగ వేలంలో గ్రామానికి చెందిన తలారి వెంకటరాములు రూ.92 వేలకు తైబజార్‌ను దక్కించుకున్నారు. ఈ సందర్భంగా అధికారులు వెంకటరాములను ఘనంగా సన్మానించారు.

సాంస్కృతిక సారథిలో ఉద్యోగాలు కల్పించండి

ఉద్యమ కళాకారుల సంఘం జిల్లా అధ్యక్షుడు సలావుద్దీన్

బంట్వారం: ఉద్యమ కళాకారులకు సాంస్కృతిక సారథిలో ఉద్యోగ అవకాశాలు కల్పించాలని రాష్ట్ర ఉద్యమ కళాకారుల సంఘం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎండీ సలావుద్దీన్ శుక్రవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రత్యేక రాష్ట్ర సాధనలో ఉద్యమంలో ఎన్నో కష్టనష్టాలను చవిచూశామని గుర్తు చేశారు. గత ప్రభుత్వంలో కొంత మందికి ఉద్యోగాలు కేటాయించినప్పటికీ ఎంతో మంది అర్హులకు అన్యాయం జరిగిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరారు.

ట్రాన్స్‌ఫార్మర్ కష్టాలు!


డీడీ చెల్లించి ఏడాదిన్నర గడిచినా తప్పని ఎదురుచూపులు

- కర్రలపై విద్యుత్ వైర్లు ఏర్పాటు చేసుకున్న రైతులు
- ఎప్పుడు ఏప్రమాదం సంభవిస్తుందోనని ఆందోళన
- కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోని అధికారులు

దోమ: ఓ వైపు ఎండలు దంచి కొడుతూ నీరందక పంటలు ఎండుతుంటే.. మరో వైపు నీరున్నా వినియోగించుకోలేని దుస్థితి. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల కోసం డీడీలు కట్టిన రైతులకు ఎదురు చూపులే మిగిలాయి తప్పా వారిని పట్టించుకునే వారే కరువయ్యారు. నిత్యం కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా తమ సమస్యపై ఓ ఒక్క అధికారి స్పందించడం లేదని రైతులు వాపోతున్నారు.

ఎనిమిది మంది రైతులు.. ఎనిమిది డీడీలు

ఓ వైపు ప్రకృతి వైపరీత్యాలు, మరో వైపు దిగుబడులు సరిగా రాక రైతులు అప్పులపాలవుతున్నారు. వీరి కష్టాలకు తోడుగా విద్యుత్ సమస్యలు తలెత్తుతున్నాయి. 2023 నవంబర్ 1వ తేదీన మండల పరిధిలోని మోత్కూరు రైతులు బుద్దారపు రాములు, బంక మల్లేశ్, చాకలి సారంగి, చాకలి అంజిలమ్మ, గుండుమల్ల అంజిలయ్య, జీ డి పెంటయ్య, సంపల్లి మల్లయ్య, జీడి రాములు ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు కోసం ప్రభుత్వానికి డీడీలు చెల్లించారు. ఒక్కో రైతు రూ.5,755 చొప్పున డీడీలు చెల్లించారు. అధికారులు అదనంగా మరో రూ.40వేలు ఓఆర్‌సీ కింద కట్టించుకున్నట్లు రైతులు వెల్లడిస్తున్నారు. మొత్తం ఎనిమిది రైతులకు గాను సుమారుగా రూ.80వేలు ఖర్చు చేశామని నేటికీ ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ స్తంభాలు, విద్యుత్ వైర్లు ఏర్పాటు చేయడంలో అధికారులు తాత్సారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీంతో చేసేదేమీ లేక 17 నెలలుగా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకుంటున్నామని.. విద్యుత్ వైర్లు కొనుగోలు చేసి కట్టెలపై కరెంట్ తీగలు లాగి విద్యుత్ వాడుకుంటున్నామని వాపోతున్నారు.





ఈదురుగాలుల కారణంగా ఇబ్బందులు

విద్యుత్ తీగలను ప్రత్యామ్నయంగా ఏర్పాటు చేసుకున్నప్పటికీ ఈదురు గాలులు, అకాల వర్షాలకు విద్యుత్ తీగలు కిందకు వేళాడుతున్నాయి. ఏడాదిన్నరగా ఇబ్బంది పడుతున్నా అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కర్రలపై ఏర్పాటు చేసుకున్న విద్యుత్ వైర్ల కారణంగా ఎప్పుడు ఏప్రమాదం సంభవిస్తుందోనని ఆందోళన చెందుతున్నామని వాపోతున్నారు. సంబంధిత అధికారులు ఇప్పటికైనా ట్రాన్స్‌ఫార్మర్లు అందజేసేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

చర్యలు తీసుకోవాలి



ట్రాన్స్‌ఫార్మర్ల కోసం డీడీలు కట్టినప్పటికీ ఎదురుచూపులే మిగిలాయి. 17 నెలలుగా అధికారుల నుంచి స్పందన కరువైంది. దీంతో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకుని పొలాలకు నీరందించుకుంటున్నాం. దీంతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదం సంభవిస్తుందోనని ఆందోళన తప్పడం లేదు. ఇప్పటికైనా అధికారులు కట్టిన డీడీలకు ట్రాన్స్‌ఫార్మర్లు అందజేసేలా చర్యలు తీసుకోవాలి.

– జీడి రాములు, రైతు, మోత్కూర్

అధికారుల నిర్లక్ష్యం



డీడీలు కట్టి ఏళ్లు గడుస్తున్నా అధికారులు ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటులో నిర్లక్ష్యం వహిస్తున్నారు. కార్యాలయానికి వెళ్లి ప్రశ్నిస్తే పొంతన లేని సమాధానాలు ఇస్తున్నారు. కట్టెలపై విద్యుత్ వైర్లు లాగి కనెక్షన్లు ఇచ్చుకున్నాం. ఈదురు గాలులు, అకాల వర్షాలకు విద్యుత్ వైర్లు కిందకు వేలాడుతున్నాయి. ప్రమాదం సంభవిస్తే ఎవరు బాధ్యత వహిస్తారు. అధికారులు సత్వరమే ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్‌స్తంభాలు ఏర్పాటు చేసి విద్యుత్‌లైన్లు ఏర్పాటు చేయాలి.

– బుద్దారపు రాములు, రైతు, మోత్కూర్

ఆందోళన చెందొద్దు



డీడీలు కట్టిన రైతుల విషయం తన దృష్టికి రాలేదు. వివరాలు తెలుసుకుని డీడీలు పరిశీలిస్తాం. అర్హులని తెలితే ట్రాన్స్‌ఫార్మర్లు, వైర్లు, స్తంభాలు అందించేందుకు చర్యలు తీసుకుంటాం. రైతులు ఆందోళనకు గురి కావొద్దు. విద్యుత్ విషయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా తమ దృష్టికి తీసుకు వస్తే వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటాం.

– జి.వినయ్‌కాంత్, విద్యుత్ ఏఈ, దోమ



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

ప్రతిభను వెలికితీసేందుకే 'యువ ఉత్సవ్'

కలెక్టర్ ప్రతీక్‌జైన్

అనంతగిరి: యువ ఉత్సవ్ వంటి కార్యక్రమాలతో యువతలోని ప్రతిభాపాటవాలను వెలికితీయవచ్చునని కలెక్టర్ ప్రతీక్‌జైన్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో జిల్లా స్థాయి యువ ఉత్సవ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కలెక్టర్ ప్రతీక్ జైన్ జ్యోతి ప్రజ్వలన చేసి ఈ ఉత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత లక్ష్యాన్ని ఎంచుకుని సాధనకు కృషి చేయాలన్నారు. క్రీడా, సాంస్కృతిక, ఇతర వైవిధ్య రంగాల్లో కృషి, పట్టుదలతో గ్రామ స్థాయి నుంచి జాతీయ స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. యువతను ప్రోత్సహించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక కార్యక్రమాలను చేపడుతున్నాయని వాటిని అందిపుచ్చుకుని ఉన్నతంగా రాణించాలని సూచించారు. వ్యసనాలకు దూరంగా ఉంటూ భవిష్యత్ తరాలకు స్ఫూర్తిదాయకంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో భాగంగా పాటలు, జానపద, పల్లె నృత్య, సైన్స్ ఫెయిర్, డ్రాయింగ్, కవిత్వం తదితర పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ సుధీర్, నెహ్రూ యువ కేంద్ర జిల్లా అధికారి ఐసయ్య, డీవైఎస్‌ఓ హనుమంతరావు, డీఎంహెచ్‌ఓ వెంకటరవణ, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ జీవరాజు, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ మల్లికార్జున్, వైస్ ప్రిన్సిపాల్ రామ సుబ్బారెడ్డి, వివిధ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.



గిరిజన సంప్రదాయ నృత్యం చేస్తున్న యువత



విజేతలకు బహుమతులు అందజేస్తున్న అదనపు కలెక్టర్ సుధీర్

మతసామరస్యానికి ప్రతీక 'ఇఫ్తార్'

అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

అనంతగిరి: ఇఫ్తార్ విందు మతసామరస్యానికి ప్రతీక అని అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. శుక్రవారం సాయంత్రం వికారాబాద్ పట్టణంలోని చిగుళ్లపల్లి గ్రౌండ్‌లో నవాబ్ మహబూబ్ అలంఖాన్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ విందుకు ముఖ్య అతిథిగా హాజరైన స్పీకర్ ముస్లింలతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనతరం ఖర్జూరా ఇచ్చి ఉపవాస దీక్షను విరమింప చేశారు. ఈ కార్యక్రమంలో గ్యాక్ ట్రస్టీ అనన్య, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మహిపాల్‌రెడ్డి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ చిగుళ్లపల్లి రమేష్‌కుమార్, ఏఎంసీ మాజీ చైర్మన్ రాంచంద్రారెడ్డి, మైనార్టీ నాయకులు షరీఫ్, తస్వర్‌అలీ, ఎండీ హఫీజ్ తదితరులు పాల్గొన్నారు.



ఖర్జూరా తినిపించుకుంటున్న నవాబ్ మహబూబ్ అలంఖాన్, స్పీకర్ ప్రసాద్‌కుమార్



చెన్నారెడ్డి దంపతులను సన్మానిస్తున్న అడిషనల్ కలెక్టర్ సుధీర్

చేసిన సేవలే నిలిచిపోతాయి

అడిషనల్ కలెక్టర్ సుధీర్

అనంతగిరి: విధి నిర్వహణలో మనం చేసిన సేవలే చిరస్థాయిగా నిలిచిపోతాయని జిల్లా అడిషనల్ కలెక్టర్ సుధీర్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం వికారాబాద్ ఎంపీడీఓ కార్యాలయం సమావేశ మందిరంలో సూపరిడెంట్‌గా విధులు నిర్వహిస్తూ ఉద్యోగవిరమణ పొందుతున్న చెన్నారెడ్డి వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ 38 ఏళ్ల సర్వీస్‌లో ఎంతోమంది ఉద్యోగులకు ఆదర్శంగా నిలుస్తూ పనిచేశారన్నారు. ప్రతి ఉద్యోగికి వృత్తి రీత్యా ఉద్యోగ విరమణ తప్పనిసరన్నారు. ప్రజలతో మమేకమై పనిచేస్తే మంచిపేరు వస్తుందన్నారు. అనంతరం చెన్నారెడ్డి దంపతులను పూలమాలలు, శాలువాలు, జ్ఞాపికలు అందించి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి సీఈఓ జానకిరెడ్డి, ఎంపీడీఓ వినయ్‌కుమార్, ఎంపీఓ దయానంద్, ఎంపీడీఓలు సత్తయ్య, అనురాధ, నర్సింలు, డానియల్, జర్నప్ప, మాజీ ఎంపీపీ చంద్రకళ, జడ్పీ, పంచాయతీరాజ్, ఉపాధి హామీ, ఆర్‌డబ్ల్యూఎస్, డీటీఓ, ఐకేపీ, విద్యాశాఖ అధికారులు, సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, కార్యాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సిబ్బంది సంక్షేమానికే | పోలీస్ కోఆపరేటివ్ సొసైటీ

ఎస్పీ నారాయణరెడ్డి

అనంతగిరి: సిబ్బంది సంక్షేమానికి జిల్లా పోలీస్‌శాఖ సిద్ధంగా ఉంటుందని ఎస్పీ నారాయణరెడ్డి అన్నారు. శుకవ్రారం ఎస్పీ కార్యాలయంలో జిల్లా పోలీస్ కోఆపరేటివ్ సొసైటీ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సొసైటీ గతేడాది నిర్వహించిన కార్యక్రమాలు, అందించిన సేవలు, భవిష్యత్ ప్రణాళికలపై సమగ్రంగా చర్చించారు. అనంతరం ఎస్పీ నారాయణరెడ్డి మాట్లాడుతూ.. పోలీస్ సిబ్బంది సంక్షేమానికి జిల్లా పోలీస్ కోఆపరేటివ్ సొసైటీ ఏర్పాటు చేశామన్నారు. సిబ్బందికి ఏవైనా ప్రమాదాలు సంభవించినప్పుడు, ఇతర అత్యవసర సందర్భాల్లో సొసైటీ నుంచి ఆర్థికసాయం అందుతుందన్నారు. ఉద్యోగవిరమణ సమయంలో ఆర్థికసాయం, పిల్లలకు విద్యాసాయం, ఇతర సంక్షేమ కార్యక్రమాలు జరుగుతుందన్నారు. సొసైటీ సభ్యులు భవిష్యత్‌లో తీసుకోవాల్సిన నిర్ణయాలు, కొత్త ప్రణాళికలు, అమలు విధానాలపై ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారుజ 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆడిట్ ఆమోదించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ హనుమంత్‌రావు, ఏఓ జ్యోతిర్మని, ఏఆర్ డీఎస్పీ వీరేశ్, డీఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ డీపీపీ రాజు, జిల్లా పోలీస్ ప్రెసిడెంట్ అశోక్, ఎస్‌ఐలు, ఆర్‌ఎస్‌ఐలు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్పీ నారాయణరెడ్డి

రాయల్టీ రగడ

- నెలాఖరుకు రూ.150 కోట్లు వసూలు లక్ష్యం
- గౌతాపూర్ చెక్‌పోస్టు వద్ద మైన్స్ అధికారుల విస్తృత తనిఖీలు
- రాయల్టీ లేనిదే కదలని లారీలు
- మైనింగ్ అధికారుల తీరుపై వ్యాపారుల గుస్సా..!

తాండూరు రూరల్: తాండూరు మండలంతోపాటు కర్ణాటక సరిహద్దులో మిర్యాణ్ గ్రామం ఉంది. ఈ రెండు ప్రాంతాల్లో వందల సంఖ్యల్లో నాపరాతి గనులు ఉన్నాయి. తాండూరులో నాపరాతి గనులు, పెద్దేముల్‌లో సుద్ద, మోమిన్ పేట్, వికారాబాద్ ప్రాంతాల్లో ఎర్రమట్టి గనులు పెద్ద ఎత్తున ఉన్నాయి. గనుల శాఖకు 2024–25 ఆర్థిక సంవత్సరానికి గాను రూ.150 కోట్లు ఆదాయం వసూలు చేయాలని ప్రభుత్వం నుంచి ఒత్తిడి వస్తుంది. ఈ క్రమంలో వారం రోజుల నుంచి మైనింగ్ ఏడీ సత్యనారాయణ తన బృందంతో పగలు, రాత్రి తేడా లేకుండా గౌతాపూర్ చెక్‌పోస్ట్ వద్ద తనిఖీలు చేపడుతున్నారు. రాయల్టీ చెల్లించకుండా ఏ ఒక్క లారీని కదలనీయడం లేదు. గతంలో ఒక్క రాయల్టీ కింద మూడు నుంచి నాలుగు లారీలు చెక్‌పోస్ట్ దాటేవి. ఆదాయం పెంచాలని అధికారులు ఒత్తిడి పెంచడంతో ఒక్క రాయల్టీ కింద ఒక్క లారీని మాత్రమే చెక్‌పోస్ట్ దాటేందుకు అనుమతిస్తున్నారు. దీంతో వ్యాపారులు అధికారుల తీరుపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. నాలుగు రోజుల క్రితం రాయల్టీలేని 11 లారీలకు రూ.1 లక్షపై చిలుకు పెనాల్టీ వేసిన విదితమే. నాపరాతి వ్యాపారం మందకొడిగాసాగుతున్న తరుణంలో రాయల్టీలపై నిబంధనలు ఎత్తివేయాలని నాపరాతి గనుల వ్యాపారస్తులు కోరుతున్నారు. ఇదే విషయంపై మైన్స్ అధికారులకు బెదిరింపు కాల్స్‌తో పాటు అధికార పార్టీ నాయకుల నుంచి ఫోన్‌లు వస్తున్నా రాయల్టీ వసూలు విషయంలో వెనుకడుగు వేయడం లేదు. మార్చి 31 వరకు రాయల్టీ లేకుండా ఒక్క లారీని కూడా చెక్‌పోస్ట్ దాటనీయమని తేల్చి చెబుతున్నారు. ప్రస్తుతం జిల్లా నుంచి గనుల శాఖకు రూ.150 కోట్ల టార్గెట్ విధించగా రూ.129 కోట్లు వసూలు చేసినట్లు అధికారులు చెబుతున్నారు. మూడు రోజుల్లో రూ.కోటి వసూలు చేస్తామంటున్నారు. గతేడాది గనుల శాఖకు జిల్లా నుంచి రూ.121 కోట్లు మాత్రమే రాబడి వచ్చిన సంగతి తెలిసిందే.



రాయల్టీ వసూలుకు తనిఖీలు చేస్తున్న మైన్స్ అధికారులు (ఫైల్)

సింహవాహనంపై శ్రీవారు

కొడంగల్ రూరల్: పేదల తిరుపతిగా పేరుగాంచిన పద్మావతి సమేత శ్రీమహాలక్ష్మీ వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో బ్రహ్మోత్సవాలు వైభంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం దేవేరుల సమేత వేంకటేశ్వర స్వామివారు సింహవాహనంపై ఆలయ మాడ వీధుల్లో ఊరేగారు. ఈ సందర్భంగా భక్తుల గోవింద నామ స్మరణతో మాడ వీధులు మార్మోగాయి. మధ్యాహ్నం ఉత్సవ మూర్తులకు అభిషేకం నిర్వహించారు.



సింహవాహనంపై ఊరేగుతున్న శ్రీస్వామివారు

సీఎం రాకకు ఏర్పాట్ల పరిశీలన



ఇఫ్తార్ విందు ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్, ఎస్పీ నారాయణరెడ్డి

అధికారులకు సూచనలిచ్చిన కలెక్టర్ ప్రతీక్ జైన్, ఎస్పీ నారాయణ రెడ్డి

కొడంగల్: మహాలక్ష్మి వేంకటేశ్వర స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఈ ఉత్సవాలకు శనివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హాజరవనుండడంతో కలెక్టర్ ప్రతీక్ జైన్, ఎస్పీ నారాయణరెడ్డి శుక్రవారం ఏర్పాట్లను పరిశీలించారు. ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న అధికారులకు కలెక్టర్, ఎస్పీ పలు సూచనలు సలహాలు ఇచ్చారు. నిరంతర విద్యుత్ సరఫరా, మూడు హెల్త్ క్యాంప్‌లు, రెండు అంబులెన్స్‌లు, వైద్య సౌకర్యాలు అందుబాటులో ఉంచాలని చెప్పారు. ఆలయ ఆవరలో శానిటేషన్, బారికేడ్‌లు వంటివి ఏర్పాటు చేయాలని సూచించారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం సాయంత్రం రాఘవేంద్ర గార్డెన్ హాల్‌లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు హాజరవుతారు. ఈ నేపథ్యంలో ఫంక్షన్ హాల్ వద్ద అధికారులతో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కడా ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డి, ఆలయ ఈఓ రాజేందర్ రెడ్డి, ఆర్‌అండ్‌బీ అధికారి శ్రీధర్ రెడ్డి, విద్యుత్ అధికారి అర్జున్ కుమార్, మున్సిపల్ కమిషనర్ బలరాం నాయక్, తహసీల్దార్ విజయ్ కుమార్, నాయకులు నందారం ప్రశాంత్, ముస్తాక్, తౌఫిక్, యూసఫ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బాల్యవివాహాలు అనాగరిక చర్య


గ్రామసభలో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి హతిరాం

కుల్కచర్ల: బాల్యవివాహాలు చేయడం అనాగరిక చర్యయని కల్మన్‌కాల్వ గ్రామ ప్రత్యేకాధికారి హతిరాం, ఇన్‌చార్జి పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శుక్రవారం చౌడాపూర్ మండల పరిధిలోని కల్మన్‌కాల్వ గ్రామ పంచాయతీలో బాల్యవివాహాలపై గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరూ బాలికల జీవనాన్ని అవగతం చేసుకుని వారికి 18 ఏళ్లు నిండిన తర్వాతే వివాహం చేయాలని సూచించారు. చిన్నతనంలోనే పెళ్ళిళ్లు చేస్తే భవిష్యత్‌లో ఇబ్బందులు ఎదురవుతాయని వివరించారు. ఈ కార్యక్రమంలో రఘు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

దళితులపై కేసుల నమోదు అన్యాయం

దళిత ఫోరం రాష్ట్ర కార్యదర్శి రామన్న మాదిగ


మాట్లాడుతున్న దళిత ఫోరం నాయకులు

కుల్కచర్ల: దళితులపై అక్రమంగా కేసులు నమోదు చేయడం అన్యాయమని దళిత ఫోరం రాష్ట్ర కార్యదర్శి పి.రామన్న మాదిగ అన్నారు. శుక్రవారం ఆయన మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ.. గతంలో పేద ప్రజల జీవనానికి భూములు కేటాయిస్తే నేడు అవే భూములను స్వాధీనం చేసుకునేందుకు ప్రభుత్వం, అధికారులు ప్రయత్నించడం విచారకరమన్నారు. కుల్కచర్ల భూ సమస్యల్లో దళితులపై అక్రమంగా నమోదు చేసిన కేసులను వెంటనే కొట్టివేయాలని కోరారు. పరిగి నియోజకవర్గ నాయకులు ప్రజలకు మేలు చేస్తామని మాటలు చెప్తున్నా క్షేత్రస్థాయిలో మాత్రం దళితులకు అన్యాయం చేస్తున్నారన్నారు. చుక్కయ్య, వెంకట్, స్థానిక రైతులు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సెంటర్లను నిర్లక్ష్యం చేస్తే చర్యలు

సీడీపీఓ కాంతారావు


మాట్లాడుతున్న సీడీపీఓ కాంతారావు

తాండూరు రూరల్: ఐసీడీఎస్ తాండూరు ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ సెంటర్లను నిర్లక్ష్యం చేస్తే సిబ్బందిపై చర్యలు తప్పవని సీడీపీఓ కాంతారావు హెచ్చరించారు. శుక్రవారం తాండూరు మండల పరిషత్ కార్యాలయ పరిధిలోని ఐసీడీఎస్ కార్యాలయంలో అదనపు సీడీపీఓ శ్రీలక్ష్మితో కలిసి ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ.. అంగన్‌వాడీ టీచర్లు సమయపాలన పాటించాలన్నారు. వేసవిలో మధ్యాహ్నం వరకు మాత్రమే సెంటర్లు తెరిచి ఉంటాయన్నారు. కొందరి టీచర్ల వలన ప్రాజెక్టుకు చెడ్డ పేరు రావొద్దని సూచించారు. గ్రామంలో జనన, మరణాలకు సంబంధించిన అన్ని వివరాలు టీచర్ వద్ద అందుబాటులో ఉండాలని సూచించారు. ప్రతీ సెంటర్‌లో మట్టికుండ ఏర్పాటు చేయాలని సూచించారు. గర్భిణులకు మధ్యాహ్నం మజ్జిగ పంపిణీ చేయాలని ఆదేశించారు. పిల్లల బరువు, ఆహార నిల్వలు, ప్రీస్కూల్ విషయాలపై సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అంగన్‌వాడీలో పిల్లలు, గర్భిణులకు, బాలింతలకు పౌష్టిక హారం అందించాలన్నారు.

ఏడుంటరో ఎవరికీ తెలియదు!

- క్యాంపుల పేరుతో ఆస్పత్రికి.. ఆస్పత్రి పేరుతో క్యాంపులకు ఎగనామం
- నాగసమందర్ పీహెచ్‌సీ పరిధిలో వైద్య సేవలు అధ్వానం
- ప్రజలకు అందుబాటులో ఉండని వైద్యురాలు
- డీఎంహెచ్‌ఓకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని రోగుల ఆవేదన


తరిగోపులలో నిర్వహించిన హెల్త్ క్యాంపులో డాక్టర్ లేకుండానే సేవలు అందిస్తున్న సిబ్బంది


నాగసమందర్ పీహెచ్‌సీలో ఖాళీగా కనిపిస్తున్న వైద్యురాలి కుర్చీ

ధారూరు: వైద్యారోగ్య శాఖలో పనిచేస్తున్న కొంతమంది నిర్లక్ష్యంతో ప్రజలకు సరైన వైద్య సేవలు అందడం లేదు. విధులను పట్టించుకోని సదరు అధికారులు యథేచ్ఛగా డ్యూటీకి ఎగనామం పెడుతున్నారు. కిందిస్థాయి సిబ్బంది సైతం ఈ అంశాన్ని మేనేజ్ చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ధారూరు మండలం నాగసమందర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న డాక్టర్ మాధవీలత వారానికి రెండుమూడు రోజులు కూడా అందుబాటులో ఉండటం లేదని రోగులు, ప్రజలు ఆరోపిస్తున్నారు. నిత్యం రాకపోకలు హైదరాబాద్ నుంచి సాగించే వైద్యురాలు వచ్చిన రోజు కూడా రెండుమూడు గంటలైనా డ్యూటీ చేయరని చెబుతున్నారు. శుక్రవారం వివిధ ఆరోగ్య సమస్యలపై ఆస్పత్రికి వెళ్లిన పలువురు నాగసమందర్ వాసులకు డాక్టర్ కనిపించలేదు. ఈ విషయమై సిబ్బందిని అడగగా తరిగోపుల గ్రామంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వైద్య శిబిరానికి వెళ్లారని చెప్పారు. దీంతో వారు తరిగోపుల వెళ్లగా అక్కడ కూడా వైద్యురాలు లేరు. ఎంపీహెచ్ఎస్ ఉమ, ఏఎన్ఎం లలిత, ల్యాబ్ టెక్నీషియన్ ప్రీతమ్ మాత్రమే శిబిరంలో కనిపించారు. డాక్టర్ ఎక్కడని ప్రశ్నించగా నాగసమందర్ ఆస్పత్రిలో ఉన్నారని చెప్పడంతో తీవ్ర అసహనం వ్యక్తంచేశారు. సదరు వైద్యురాలిపై పలుమార్లు డీఎంహెచ్‌ఓకు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని మండిపడ్డారు. ఈ విషయమై కలెక్టర్ స్పందించి, పేద ప్రలకు ప్రభుత్వ వైద్యం అందేలా చూడాలని కోరారు. ముఖ్యమంత్రి సొంత జిల్లాలో పనిచేస్తున్న అధికారులే ఇలా ఉంటే ఇతర ప్రాంతాల్లో సేవలు ఇంకెలా ఉంటాయని ఆగ్రహం వ్యక్తం చేశారు.


చెరుకు చేనులో గొడుగు నీడన పనులు చేస్తున్న కూలీలు

మండే ఎండ.. గొడుగే అండ!

భానుడి ప్రతాపంతో ఎండలు మండిపోతున్నాయి. ఉక్కపోతతో జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. దీంతో ఇళ్లలోని ఫ్యాన్లు, కూలర్లు పొద్దంతా తిరుగుతూనే ఉన్నాయి. ఇదిలా ఉండగా వ్యవసాయ పనులు చేసే రైతులు, కూలీలు ఎండలో పనిచేసేందుకు ఇబ్బంది పడుతున్నారు. ఎండకు భయపడితే పనులు కదలడం లేదని భావించి పొలం వద్ద గొడుగులు ఏర్పాటు చేసుకుని చెరుకు నరికే పనుల్లో కనిపించారు. కుదురుమల్ల- సంగాయపల్లి గ్రామాల మధ్యలో శుక్రవారం కనిపించిన ఈ దృశ్యాన్ని సాక్షి కెమెరా క్లిక్‌మనిపించింది. అనంతరం కూలీలు కుర్వ చిన్న కిష్టప్ప, మౌనిక, నవనీతను పలకరించగా ఎండైనా.. వానైనా పొట్టకూటి కోసం పనిచేయక తప్పదు కదా సారూ అంటూ బదులిచ్చారు. – దుద్యాల్

అన్నదాతకు అండగా ఉంటాం


మాట్లాడుతున్న వెంకట్‌రామ్‌రెడ్డి

నావంద్గీ సహకార సంఘం చైర్మన్ వెంకట్‌రామ్‌రెడ్డి

బషీరాబాద్: వ్యవసాయ రంగాన్ని లాభసాటిగా చేయడం కోసం అన్నదాతలకు సొసైటీ అండగా నిలుస్తుందని నావంద్గీ సహకార సంఘం చైర్మన్ వెంకట్‌రామ్‌రెడ్డి పేర్కొన్నారు. అప్పుల్లో ఉన్న సహకార సంఘాన్ని పాలవర్గం తీసుకున్న ఆర్థిక క్రమశిక్షణతో వార్షిక ఆదాయాన్ని రూ.1.20 కోట్లకు చేర్చినట్లు వెల్లడించారు. శుక్రవారం మండల కేంద్రంలోని సొసైటీలో పాలకమండలి ఎంసీ, సాధారణ సమావేశం నిర్వహించి పలుకీలక తీర్మాణాలు చేశారు. అనంతరం సొసైటీ వైస్ చైర్మన్ అజయ్ ప్రసాద్, పాలకమండలి సభ్యులతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రైతులకు పంట రుణాలు, దీర్ఘకాలిక రుణాలు ఇవ్వడంతో పాటు విత్తనాలు, ఎరువుల పంపిణీ చేస్తున్నామని చెప్పారు. వాణిజ్యపరమైన వ్యాపారంతో బలమైన ఆర్థిక శక్తిగా సొసైటీని నిలబెట్టామన్నారు. సొసైటీ లాభాలతో నెలకు రూ.4లక్షలు ఆదాయం వచ్చేలా ఆర్థిక వనరులను ఏర్పాటు చేసుకున్నట్లు చెప్పారు. సొసైటీ పరిధిలో 4,400 మంది రైతులు ఉండగా రూ.8.82కోట్ల పంటరుణాలు ఇచ్చినట్లు తెలిపారు. రైతుల వాటాధనం కిందా రూ. కోటి నిధులతో పాటు, రూ.3.50 కోట్ల ఫిక్స్‌డ్ డిపాజిట్లను సొసైటీ సొంతం చేసుకుందని చెప్పారు. గతంలో రూ.1.79 కోట్ల దీర్ఘకాలిక రుణాలు ఇస్తే పది శాతం కూడా రైతులు చెల్లించలేదన్నారు. రైతులు సకాలంలో తిరిగి చెల్లిస్తే మళ్లీ రెండు రెట్లు అధికంగా వారికి రుణాలు మంజూరు చేయడానికి సంఘం సిద్ధంగా ఉన్నట్లు వివరించారు.

త్వరలో పెట్రోల్ బంక్, రైస్ మిల్..

సొసైటీ సొంత నిధులతో పాటు రూ.2 కోట్ల నాబార్డు రుణాలతో నిర్మిస్తున్న పెట్రోల్ బంక్, రైస్ మిల్ నిర్మాణాలు దాదాపు పూర్తికావస్తున్నాయని చెప్పారు. త్వరలోనే వీటిని ప్రారంభిస్తామని చెప్పారు. అలాగే 1,500, 1000 మెట్రిక్ టన్నుల ధాన్యం నిల్వ చేసే రెండు భారీ గోదాంల నిర్మాణ పనులు కూడా శరవేగంగా జరుగుతున్నాయన్నారు. వాణిజ్యపరమైన పెట్రోల్ బంక్, రైస్‌మిల్ సేవలు అందుబాటులోకి వస్తే వార్షిక ఆదాయం నాలుగు రెట్లు పెరుగుతుందన్నారు. ప్రభుత్వం సొసైటీ పాలకవర్గాలకు మరో ఆరు నెలలు పొడగించినందుకు సీఎం రేవంత్‌రెడ్డికి, స్థానిక ఎమ్మెల్యేకు పాలకవమండలి సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే కొంత కాలంకిందట మృతి చెందిన డైరెక్టర్ రూప్లానాయక్‌కు సమావేశంలో సంతాపం తెలిపారు.

మంత్రిని కలిసిన టీపీఎస్ఎఫ్ రాష్ట్ర నాయకులు

అనంతగిరి: తెలంగాణ పంచాయతీ సెక్రటరీస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్కను ప్రజా భవన్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. గ్రేడ్-4 పంచాయతీ కార్యదర్శుల సర్వీస్, ఎఫెక్టివ్ తేదీకి సంబంధించిన ప్రాసెస్ మొదలు పెడుతూ సర్క్యులర్ విడుదల చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీకాంత్‌గౌడ్, జనరల్ సెక్రటరీ నాగరాజు, ట్రెజరర్ శశిధర్‌గౌడ్‌తో పాటు వికారాబాద్ జిల్లా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలపై అవగాహన

పరిగి: యువత డ్రగ్స్‌కు బానిసకావద్దని పరిగి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సునీతా పద్మావతి పేర్కొన్నారు. శుక్రవారం కళాశాలలో మాదకద్రవ్యాల నివారణకు సంబంధించి వాల్ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డ్రగ్స్‌కు బానిసైన యువత మత్తులో పడి అవాంఛనీయ ఘటనలకు పాల్పడుతున్నారన్నారు. విద్యార్థులు డ్రగ్స్‌కు బానిన పడకుండా క్రమశిక్షణతో మెలగాలని సూచించారు. ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు మాదకద్రవ్యాల వాడకంపై అవగాహన కల్పిస్తున్నారన్నారు. స్నేహితుల్లో ఎవరైనా మాదకద్రవ్యాలు వాడుతుంటే వారి కుటుంబంలో గానీ, పోలీసులకు గానీ సమాచారం అందించాలని సూచించారు. ఎక్కడ మాదకద్రవ్యాలు విక్రయించిన వెంటనే పోలీసుకుల సమాచారం చేరవేయాలన్నారు. ఈ కార్యక్రమంలో యాంటీ డ్రగ్స్ కమిటీ కన్వీనర్ గంగాధర్, వైస్ ప్రిన్సిపల్ డేవిడ్, అధ్యాపకులు సంత్, జనార్దన్, విజయలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.



వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న డిగ్రీ కళాశాల అధ్యాపక బృందం

రేషన్ కార్డు నిబంధన తొలగించాలి

కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్కయ్య


తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న ప్రజాసంఘాల నాయకులు

యాలాల: రాజీవ్ వికాస్ పథకం దరఖాస్తు ప్రక్రియలో రేషన్‌కార్డు నిబంధన తొలగించి, దరఖాస్తు గడువు ఏప్రిల్ 30వ తేదీ వరకు పొడిగించాలని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పలి మల్కయ్య కోరారు. ఈ విషయమై శుక్రవారం ప్రజాసంఘాల ఆధ్వర్యంలో తహసీల్దార్ అంజయ్యకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన రాజీవ్ యువ వికాస్ పథకంలో లబ్ధిపొందేందుకు సమయం తక్కువ మొత్తంలో ఉండడం, మధ్యలో పండుగ సెలవులు ఉండటం వల్ల దరఖాస్తుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని చెప్పారు. దీంతో కొత్త రేషన్ కార్డుల జారీకి అవకాశం ఇవ్వడంతో ఉమ్మడి కుటుంబంలో ఉండి వివాహం చేసుకున్న వారు కొత్త రేషన్‌కార్డుల దరఖాస్తు చేసుకునేందుకు పాత రేషన్‌కార్డుల నుంచి తమ వివరాలను తొలగించుకున్నారన్నారు. ప్రస్తుతం వారందరికి రాజీవ్ యువ వికాసంలో దరఖాస్తుకు అవకాశం లేనందున రేషన్ కార్డు నిబంధనను తొలగించాలని కోరారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో బీఆర్ఎస్ ఎస్సీ సెల్ మండల నాయకుడు కృష్ణ, బీఎస్పీ తాండూరు ఉపాధ్యక్షుడు కృష్ణయ్యగౌడ్, రాంచందర్ ఉన్నారు.

సీఎంఆర్ఎఫ్‌తో పేదలకు మేలు


చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే యాదయ్య

చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య

నవాబుపేట: సీఎంఆర్ఎఫ్‌తో పేదలకు మేలు చేకూరుతుందని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో బాధితులకు మంజూరైన రూ.11.64లక్షల విలువైన 30 చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజాప్రభుత్వం అర్హులైన పేదలకు సంక్షేమ పథకాలు అందించేందుకు కృషి చేస్తోందన్నారు. కార్పొరేట్ ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకునేందుకు సీఎంఆర్ఎఫ్ అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ రాంరెడ్డి, ఏఎంసీ చైర్మన్ గీతాసింగ్ నాయక్, డైరెక్టర్లు నరసింహారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, ఖదీర్, లింగం, కుమార్, మాజీ ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

మర్రిచెట్టుకు మంటలు

కుల్కచర్ల: మినీ పిల్లలమర్రిగా పేరొందిన కొత్తపల్లి మర్రిచెట్టు అగ్నిప్రమాదానికి గురైంది. గురువారం రాత్రి అకస్మాత్తుగా మంటలు చెలరేగి ఐదెకరాల విస్తీర్ణంలో ఉన్న మర్రిచెట్టు అగ్నికి ఆహుతైంది. గమనించిన స్థానికులు, గ్రామస్తులు ఘటనస్థలికి చేరుకున్న గ్రామస్తులు ఫైరింజన్‌కు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలికి చేరుకున్న అగ్నిమాపక శాఖ అధికారులు స్థానికులతో కలిసి మంటలు అదుపులోకి తెచ్చారు. 200 ఏళ్ల చరిత్ర ఉన్న మర్రిచెట్టు, ఇక్కడే ఉన్న ఆంజనేయస్వామి వారి ఆలయ సంరక్షణలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.


మర్రి చెట్టు నుంచి ఎగిసి పడుతున్న మంటలు

పనికోసం వెళ్లి.. శవమై తేలాడు

- లక్నాపూర్ ప్రాజెక్టులో మునిగి యువకుడి మృతి
- ఈత కొట్టేందుకు నీళ్లలోకి డైవ్ చేసిన ఫయాజ్
- బండరాళ్లు తలకు తగిలి దుర్మరణం
- ఆందోళనకు గురై పురుగుమందు తాగిన స్నేహితుడు


మృతుడు ఫయాజ్ (ఫైల్)

పరిగి: పని వెతుక్కునేందుకు వచ్చిన యువకుడు చెరువులో శవమై తేలిన సంఘటన మండల పరిధిలోని లక్నాపూర్ ప్రాజెక్టులో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్ఐ సంతోష్‌కుమార్, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ధారూరు మండలం మోమిన్‌కలాల్ గ్రామానికి చెందిన మహ్మద్ ఫయాజ్(24), ఇదే గ్రామానికి చెందిన రాజేందర్ కలిసి పని కోసం గురువారం బైక్‌పై పరిగికి వెళ్లారు. సాయంత్రం వేళ ఇంటికి వెళ్తూ.. లక్నాపూర్ ప్రాజెక్టు వద్ద ఆగారు. తాను ఈత కొడుతానంటూ ఫయాజ్ నీళ్లలోకి డైవ్ చేశాడు. ఎంత సేపైనా బయటకు రాకపోవడంతో ఆందోళనకు గురైన రాజేందర్ బైక్ తీసుకుని గ్రామానికి వెళ్లి, జరిగిన విషయాన్ని ఫయాజ్ కుటుంబ సభ్యులుకు చెప్పాడు. ఫయాజ్ చనిపోయి ఉంటాడనే భయంతో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. ఇది గమనించి కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించగా రాజేందర్ కోలుకుంటున్నాడు. ఇదిలా ఉండగా గ్రామస్తులు, ఫయాజ్ కుటుంబ సభ్యులు ప్రాజెక్టు వద్దకు పరిశీలించినా అప్పటికే రాత్రి కావడంతో ఏమీ చేయలేక పోయారు. శుక్రవారం ఉదయం గజ ఈతగాళ్లతో గాలించగా శవాన్ని బయటకు తెచ్చారు. ప్రాజెక్టులోకి డైవ్ చేయడంతో బండరాళ్లు తలకు తగలి చనిపోయాడని గుర్తించారు. తండ్రి గౌసొద్దీన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

గిరిజనుల సంక్షేమానికి కృషి


మాట్లాడుతున్న శ్రీనునాయక్

ఆదివాసీ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు శ్రీనునాయక్

షాద్‌నగర్: రాష్ట్ర ప్రభుత్వం గిరిజనుల సంక్షేమానికి పెద్దపీట వేసిందని ఆదివాసీ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు శ్రీనునాయక్ అన్నారు. గోర్‌బోలీ భాషను రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్‌లో చేర్చాలని అసెంబ్లీలో తీర్మానం చేసిన సందర్భంగా శుక్రవారం షాద్‌నగర్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పార్టీశ్రేణులు సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. అనంతరం శ్రీనునాయక్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వానికి గిరిజనులపై ఎనలేని చిత్తశుద్ధి ఉందన్నారు. అందులో భాగంగా గోర్‌బోలీ భాషను రాజ్యాంగంలో చేర్చాలని తీర్మానం చేసిందన్నారు. దేశంలో హిందీ తర్వాత అత్యధికంగా గోర్‌బోలీ మాట్లాడుతున్నారని చెప్పారు. లిపిలేని భాషను అధికారికంగా గుర్తించాలని ఎంతో కాలంగా గిరిజనులు బెల్లయ్య నాయక్ నేతృత్వంలో పోరాటం చేస్తున్నారని గుర్తు చేశారు. కార్యక్రమంలో నాయకులు రఘునాయక్, శుక్రునాయక్, బాలునాయక్, మోహన్‌నాయక్, వేణునాయక్, ప్రేమ్‌నాయక్, గణేష్‌నాయక్, సుమన్‌నాయక్, సంతోష్, శంకర్‌నాయక్, వినోద్, సూర్యనాయక్, మల్లేశ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

రాయితీ పరికరాల దరఖాస్తుకు నేడే ఆఖరు

యాలాల: ప్రభుత్వం రైతులకు రాయితీపై అందిస్తున్న వ్యవసాయ పరికరాల దరఖాస్తుకు శనివారం చివరి తేదీ అని రాస్నం క్లస్టర్ ఏఈఓ శిరీష పేర్కొన్నారు. రాస్నం క్లస్టర్ పరిధిలో పవర్ స్ప్రేయర్-2, బ్యాటరీ స్ప్రేయర్-1, కల్టివేటర్-1 యంత్ర పరికరాలు ఉన్నాయన్నారు. పట్టాపాసుపుస్తకాలు కలిగిన ఎస్సీ, ఎస్టీ జనరల్ మహిళలు మాత్రమే దరఖాస్తుకు అర్హులన్నారు. ఆసక్తిగల వారు మండల కేంద్రంలోని వ్యవసాయాధికారి కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని ఏఈఓ సూచించారు.

పశువులు పైలం

- వడ దెబ్బతో మూగజీవాలు అనారోగ్యానికి గురయ్యే ప్రమాదం
- సరైన మెలకువలు పాటించకపోతే ప్రాణాలకే ముప్పు



తాండూరు: ప్రస్తుతం ఎండలు తీవ్రతరం కావడంతో మనుషులతో పాటు పశువులు వడదెబ్బకు గురయ్యే అవకాశం ఉంది. ఒక్కోసారి మృత్యువాత పడే ప్రమాదం కూడా ఉంది. ఈ సమయంలో పశుపోషకులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మెలకువలు, చికిత్సపై వెటర్నరీ అధికారుల సలహాలు.. సూచనలు.. వాతావరణంలో ఉష్ణోగ్రత ఎక్కువైనప్పుడు మెదడులో హైపోథాలమస్ అనే భాగం స్వేద గ్రంధులు చెమటను అధికంగా ఉత్పత్తి చేస్తాయి. శరీరంలో ధాతువులు కోల్పోయి జీవక్రియ దెబ్బ తింటుంది. శరీర ఉష్ణోగ్రత పెరిగి శ్వాస, గుండె, నాడి, మూత్ర పిండాల పనితీరు క్షీణిస్తుంది.శ్వాస సరిగా అందక మరణించే అవకాశాలున్నాయి.

దెడ దెబ్బ లక్షణాలు..

పశువులలో శరీర ఉష్ణోగ్రత 100 డిగ్రీల సెల్సియస్‌ను మించుతుంది. చర్మం మృదుత్వం, తగ్గిపోయి. గట్టి పడుతుంది. నోటితో గాలి పీల్చుకోవడం, నోటి వెంట చొంగ కారడం, ఆవుల్లో పాల దిగుబడి మందగించడం, చూలు కట్టే శాతం తగ్గడం, గర్భస్రావం కావడం, పక్షవాతం, లక్షణాలు సంభవించి క్రమంగా కోమాలోకి వెళ్లడం వంటివి కనిపిస్తాయి. పరిస్థితి తీవ్రంగా మారితే పశువులు చనిపోతాయి.

కారణాలివే..

- గాలిలో తేమ అధికంగా ఉండటం.
- వాతావరణంలో ఉష్ణోగ్రతలు పెరగటం
- పాకలో సామర్థ్యానికి మించి పశువులు ఉండటం
- నీటి లభ్యత తక్కువగా ఉన్నప్పుడు
- వడగాలులతో పశువులు ఒత్తిడికి లోను కావడం.

చికిత్స విధానం..

వడదెబ్బకు గురైన పశువులను వెంటనే నీడ ప్రాంతంలోకి మార్చి వీలైతే ఫ్యాన్‌లు లేదా కూలర్‌ల సాయంతో చల్లని గాలి అందించాలి. బాగా ఎండగా ఉం పశువులను చల్లని నీటితో పలుమార్లు కడగాలి. చల్లని నీటిని తాగడానికి అందుబాటులో ఉంచి నొప్పులను తగ్గించడానికి నొప్పి నివారణ,(అనాల్జెసిక్) మందును వాడాలి, రక్తంలోకి డైక్స్ట్రో సెలైన్ లవణ ద్రావణాలు ఎక్కించాలి.

నివారణ చర్యలు..

వేసవిలో పశువులను ఉదయం 10నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు పశువులను మేతకు బయటకు వదలకూడదు.

- చల్లని నీరు తాగేందుకు అందుబాటులో ఉంచాలి.
- రోజుకు 3 లేదా 4 సార్లు చల్లని నీటితో పశువులను కడగాలి. లేదా చెరువులలో నీరు నిల్వ ఉన్న కుంటలలో పశువులను వదలాలి.
- కొట్టాలను బాగా ఎత్తుగా నిర్మించుకొని పైన ఎండుగడ్డితో కప్పాలి. ఎండ ఉన్న సమయంలో పశువులపై నీటిని చల్లుతుండాలి.
- పశువుల పాకలో వడగాలి వీస్తున్న దిక్కులలో గోనె సంచులను కట్టి తరచూ నీళ్లతో తడపాలి.
- నీటి శాతం అధికంగా ఉన్న పచ్చి మేతను పశువులకు వేయాలి.
- ఎక్కువగా దాణా పెడుతున్నప్పుడు కొంచెం వంట సోడా కలపడం వల్ల ఎండ వేడిమికి గురైన పశువుల్లో అజీర్తి సమస్యను నివారించవచ్చు.